క్లుప్తంగా

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

డోర్నిపాడు: పచ్చిరొట్ట ఎరువుల్లో భాగంగా జీలుగ విత్తనాలను సబ్సిడీ ద్వారా అందిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి సునీత గురువారం తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో జీలుగ విత్తనాలు క్వింటా రూ.8,800 ఉండగా 50 శాతం రాయితీ పోనూ రైతులు క్వింటాకు రూ.4,400 చెల్లించాల్సి ఉంటుందన్నారు. అవసరమైన రైతులు ఆయా గ్రామాల్లోని వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

గౌరవ వేతనం చెల్లించాలి



మాట్లాడుతున్న నగరి శ్రీనివాసులు

నంద్యాల(న్యూటౌన్): ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు సరైన గౌరవ వేతనం చెల్లించాలని ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర కార్యదర్శి నగరి శ్రీనివాసులు, సాంబశివుడు ఎన్నికల అధికారులను కోరారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో పీఓ, ఏపీఓలకు ఆరు రోజులకు, ఓపీలకు నాలుగు రోజులకు గౌరవ వేతనం చెల్లించాల్సి ఉండగా మూడు రోజులకు మాత్రమే చెల్లించడం అన్యాయమన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పీఓ, ఏపీఓలకు ఆరు రోజుల గౌరవ వేతనం చెల్లించారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పోలింగ్ సిబ్బంది కనీస వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ఎన్నికల అధికారి స్పందించి గౌరవ వేతనం సక్రమంగా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. జయరాం, పుల్లయ్య, మునిస్వామి, రవి, వెంకటేశ్వర్లు, ప్రతాపరెడ్డి, బాలస్వామి, విజయకుమార్, వెంకటరామిరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

సమాజంలో విద్యారంగం కీలకమైనది



మాట్లాడుతున్న సూర్యనారాయణ

నంద్యాల(న్యూటౌన్): సమాజంలో విద్యారంగం అత్యంత కీలకమైందని ఆంధ్రప్రదేశ్ అనంతపురం సమితి అధ్యక్షుడు, విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర సభ్యుడు డాక్టర్ రామకృష్ణారెడ్డి, సంస్థ ప్రశిక్షణ ప్రముఖ్ సూర్యనారాయణ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని రామకృష్ణ విద్యాసంస్థల మైదానంలో రాష్ట్రస్థాయి శిశు మందిర ఆచార్యుల ప్రశిక్షణ వర్గ కార్యక్రమం నిర్వహించారు. దక్షిణ మధ్య క్షేత్ర కార్యదర్శి సుధాకర్‌రెడ్డి , శాంతినికేతన్ విద్యాసంస్థల అధినేత సుధాకర్, ఆరవేటి సత్యనారాయణగుప్త, విద్యాభారతి, వీసీ నరసింహులు, డాక్టర్ ఉదయ్ శంకర్, కన్నాభాస్కర్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

నివాళి

శిరివెళ్ల: మండలంలోని గుంప్రమాన్‌దిన్నెకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ముక్కమల నవీన్‌కుమార్‌రెడ్డి (26) మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకరరెడ్డి గురువారం గ్రామానికి చేరుకొని ఉద్యోగి మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. బెంగుళూరులో పని చేస్తున్న యువకుడు ఓటు వేయడానికి ఈ నెల 12న స్వగ్రామానికి వచ్చాడు.అయితే అనారోగ్యంతో యర్రగుంట్లలోని ఓ ఆర్ఎంపీ వద్ద చికిత్స చేయించుకున్నాడు. 13న ఓటు వేశాడు. రాత్రికి కాలి నొప్పి అధికం కావడంతో బంధువులు నంద్యాల ప్రైవేట్ నర్సింగ్‌హోంకు తరలించారు. కాలికి చికిత్స చేసినా ఫలితం లేకపోయింది. దీంతో 15వ తేదీన రాత్రి మృతి చెందాడు.

వ్యక్తి మృతిపై 21న బహిరంగ విచారణ

బొమ్మలసత్రం: నంద్యాల ఉప కారాగారంలో రిమాండ్ ముద్దాయిగా ఉన్న అనకాపల్లి జిల్లా రోళ్లగుంట మండలం కొత్తపట్నం గ్రామానికి చెందిన కొండలరావు అనే వ్యక్తి అనారోగ్యం కారణంగా గత ఏడాది నవంబర్ 13న కర్నూల్ సర్వజన ఆసుపత్రిలో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో నంద్యాల ఆర్డీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన ఉదయం 11 గంటలకు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఆయన మృతిపై బహిరంగ విచారణ చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించి ఎవరైనా అభ్యంతరాలు తెలియజేయదలుచుకుంటే ఆర్డీఓ కార్యాలయంలో నేరుగా సంప్రదించి, వాంగ్మూలం ఇవ్వాలని ఆర్డీఓ కోరారు.

డెంగీని నివారిద్దాం

చాగలమర్రి: సమాజ భాగస్వామ్యంతో డెంగీని నివారిద్దామని స్థానిక పీహెచ్‌సీ వైద్యులు షేక్ ఇమ్రాన్, అంజలి సిబ్బందికి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పీహెచ్‌సీ సమావేశ భవనంలో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని సూచించారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని, వాడి పడవేసిన కొబ్బరి బోండాలు, పాత డబ్బాలు, టైర్లను పరిసరాల్లో ఉంచుకోవద్దని ప్రజలకు సూచించాలని చెప్పారు.

కౌలు రెట్టింపు!

- ఎకరాకు రూ.30వేల నుంచి రూ.40 వేలకు పలుకుతున్న వైనం
- గతేడాది కలిసొచ్చిన పత్తి, మిరప, జొన్న సాగు
- పొలం, సాగునీరు వసతిని బట్టి డిమాండ్
- గత ఖరీఫ్‌లో రైతన్నలకు సిరుల పంట

డోర్నిపాడు: వ్యవసాయ రంగంలో పంటలు మంచి దిగుబడులు వస్తే కూలీలకు చేతినిండా పనులు ఉంటాయి.. ఎరువుల దుకాణాలకు మంచి వ్యాపారం ఉంటుంది.. ట్రాక్టర్లకు బాడుగ లభిస్తుంది.. దుకాణాలు, మిల్లులు, గోదాములు, లారీలు ఇలా అనుబంధ రంగాలన్నీ లాభాల బాట పడతాయి. గతేడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ వాతవారణం అనుకూలించడంతో రైతులకు మంచి దిగుబడులు రావడమే కాకుండా గిట్టుబాటు ధర కూడా లభించింది. దీంతో ఈ ఏడాది పొలాల కౌలు ఒక్కసారిగా పెరిగింది. అయినా రైతులు ఏమాత్రం వెనకడుగు వేయకుండా రెట్టింపు కౌలు చెల్లించి మరీ పొలాలను ముందస్తుగానే ఒప్పందం చేసుకుంటున్నారు.

అనుకూలంగా వర్షాలు

ఇప్పటికే వాతావరణశాఖ వర్షం రాకపై తీపికబురు అందించింది. రుతుపవనాలు అనుకున్న దానికంటే ముందుగానే రానున్నాయని ప్రకటించారు. దీంతో రైతులు ముందస్తుగా మంచి పొలాలు, అలాగే నీటి వసతి ఉన్న వాటిని ఎంచుకొని ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40వేల వరకు వెచ్చించి కౌలుకు తీసుకుంటున్నారు. గత ఖరీఫ్‌లో ఎకరాకు రూ.30 వేల వరకు చెల్లించారు. వర్షాభావ పరిస్థితులు ఎదురైనప్పటికి కేసీకి సాగునీరు విడతల వారీగా వదలంతో మంచి దిగుబడులు సాధించారు. ముఖ్యంగా పత్తి, మిరప, జొన్న, కంది పంటలు సిరులు కురిపించాయి.

మండలంలో ఇలా..

పొలం లేకుండా కేవలం కౌలు ఆధారంగా ఉండే రైతులు దాదాపు 300 మంది వరకు ఉండగా.. 1000–1500 ఎకరాలను కౌలుకు తీసుకుని పంటలు సాగుచేస్తున్నారు. అలాగే.. పొలం ఉండి మరింత పొలాన్ని కౌలుకు తీసుకునే రైతులు దాదాపు 700–750 మంది ఉన్నారని, వీరు 1500–2000 ఎకరాలు కౌలుకు చేస్తున్నారని అధికారులు పేర్కొంటున్నారు.



బుర్రారెడ్డిపల్లె వద్ద విరగ్గాసిన పత్తి పంట (ఫైల్)

కౌలు రైతుకు అండగా ప్రభుత్వం..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వడంతో పాటు వారికి వైఎస్సార్ రైతు భరోసా అందించింది. ఎలాంటి సొంత పొలం లేని 296 మంది కౌలు రైతులకు ప్రభుత్వం రూ.13,500 రైతు భరోసా అందించి ఆదుకుంది.

తొలకరి సాగుకు ముందు తీసుకోవలసిన జాగ్రత్తలు..

- పంట కోసిన తర్వాత పంట వ్యర్థాలను తగలబెట్టకుండా భూమిలో కలియదున్నాలి. ఇలా చేయడం వల్ల పంట వ్యర్థాలు కుళ్లి భూమిలో సేంద్రియ పదార్థాలుగా మారి నేలను సారవంతంగా చేస్తాయి.
- మట్టి నమూనాల సేకరణకు, భూసార పరీక్షలకు ఇదే సరైన సమయం. రైతులు తమ వ్యవసాయాధికారులను సంప్రదించి మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్షలు చేయించాలి. ఆ ఫలితాల ఆధారంగా ఎరువులను వాడాలి.
- వర్షా కాలంలో వరి పంట వేసుకునే రైతులు ఈ నెల చివరి వారంలో తొలకరి వర్షాలకు పచ్చిరొట్ట విత్తనాలను చల్లుకొని వాటి పూతకు ముందు పొలంలో కలియ దున్నాలి. ఇలా దున్నిన ఐదు రోజుల తర్వాత నాట్లు వేసుకోవాలి. పచ్చిరొట్ట సాగుచేయడం వల్ల భూమి సారవంతమవడమే కాకుండా పంటకు కావాల్సిన నత్రజనిని కూడా పచ్చిరొట్ట పైర్లు అందిస్తాయి.



డోర్నిపాడు సమీపంలో వేసవి దుక్కులు దున్నుతున్న దృశ్యం

గతేడాది మండలంలో ఖరీఫ్ కింద సాగుచేసిన పంటల వివరాలు..

పంటలు	సాగుచేసిన విస్తీర్ణం (హెక్టార్లలో)
వరి	1,252
జొన్న	46
కొర్ర	14
కంది	86
మినుము	525
వేరుశనగ	19
సోయాబీన్	16
మిరప	277
పత్తి	1,065
కూరగాయలు	67
మొత్తం	3,437

‘పొలాలకు మంచి డిమాండ్ ఉంది



మండలంలో అధికంగా నల్లరేగడి పొలం ఉండటంతో పత్తి సాగుకు అనుకూలిస్తుంది. ఎకరాకు రూ.30 నుంచి రూ.40 వేల వరకు ముందస్తుగా కౌలు చెల్లించి పొలాన్ని తీసుకుంటున్నారు.గత ఖరీఫ్‌లో వర్షాలు లేకపోయినప్పటికీ ఎకరాకు రూ.2లక్షల వరకు ఆదాయం వచ్చింది. దీంతో రైతులు రెట్టింపు కౌలు చెల్లిస్తున్నారు.

– బత్తుల కృష్ణ, డోర్నిపాడు

ఇప్పటికే 30 ఎకరాలు కౌలుకు తీసుకున్నా



గతేడాది ఎకరానికి రూ.30 వేలు చెల్లించి 30 ఎకరాలు కౌలుకు తీసుకుని అగ్రిమెంట్ సీడు జొన్న సాగు చేశా. పెట్టుబడులు పోనూ ఎకరానికి రూ.50 వేల వరకు ఆదాయం వచ్చింది. ప్రస్తుతం అదే పొలాన్ని మరికొందరు రూ.40వేల వరకు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారు. ధాన్యానికి మద్దతు ధర వస్తుందని ఆలోచిస్తున్నారు.

–శ్రీపతి ప్రసాద్, బుర్రారెడ్డిపల్లె

రైతులకు మంచి రోజులు



ఈ ఏడాది ఖరీఫ్ మంచి శుభారంభం ఇవ్వనుందని ఆశిస్తున్నాం. ఈసారి మంచి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ఇప్పటికే పేర్కొంది. అలాగే ఇక్కడ కేసీ కాలువ ఉండటంతో పొలాలకు డిమాండ్ ఉంది. ఇక్కడి నల్లరేగడి భూములు పత్తి, మిరప, జొన్న, మినుము, కంది పంటలకు అనుకూలం. ముఖ్యంగా వేసవిలో పడే తొలకరి వర్షంతో మెట్ట రైతులు లోతుగా అడ్డంగా లోతుగా దున్నుకోవాలి. దీనివల్ల తదుపరి కాలంలో పడే వర్షపునీరు భూమిలోకి ఎక్కువగా ఇంకి నేల సాగుకు అనుకూలంగా మారుతుంది.

– సునీత, మండలవ్యవసాయాధికారి, డోర్నిపాడు

స్థోమత లేని ఖైదీలకు న్యాయ సహాయం



సబ్ జైలులో రికార్డులు పరిశీలిస్తున్న జడ్జి

ఆళ్లగడ్డ: ఆర్థిక స్థోమతలేని రిమాండ్ ఖైదీలకు ఉచితంగా న్యాయ సహాయం అందజేయడంతో పాటు అవసరమైన సూచనలు సలహాలు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అందజేస్తామని సంస్థ అధ్యక్షుడు, ఆళ్లగడ్డ ఐదవ అదనపు జిల్లా జడ్జి మురళీకృష్ణ తెలిపారు. పట్టణంలోని ఉప కారాగారాన్ని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి జైలు సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం రిమాండ్ ఖైదీలతో మాట్లాడి జైలులో కల్పిస్తున్న వైద్య సదుపాయాలు, వసతులపై ఆరా తీశారు. జైలు అధికారి సెల్వింత్ ఉన్నారు.

మహానందీశ్వరస్వామి ఆభరణాల పరిశీలన

మహానంది: మహానందీశ్వరస్వామి దేవస్థానానికి చెందిన బంగారు, వెండి ఆభరణాలను పరిశీలించే కార్యక్రమం చేపట్టారు. గతంలో ఇక్కడ ఈఓగా పనిచేసి ప్రస్తుతం కాళహస్తి ఏసీ మల్లికార్జున ప్రసాద్ గురువారం మహానంది దేవస్థానం కార్యాలయానికి చేరుకుని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బందితో సమావేశమయ్యారు. స్వామి వారికి చెందిన బంగారు, వెండి ఆభరణాలు, వస్తువుల వివరాలను పరిశీలించారు. వివిధ బ్యాంకుల లాకర్లలో నిల్వ ఉంచిన వాటితో పాటు స్వామి, అమ్మవార్లకు అలంకరించిన, భక్తులు సమర్పించిన వస్తువుల వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి పూర్తిస్థాయిలో రికార్డుల్లో పొందుపరిచారు.

సరదా.. సరదాగా..





ఉయ్యాలవాడ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

ఉయ్యాలవాడ : వేసవి సెలవులు వచ్చాయంటే చాలు విద్యార్థుల్లో ఎక్కడా లేని ఆనందం. గతంలో విహార యాత్రలకు, అమ్మమ్మ, నానమ్మ స్వగ్రామాలకు వెళ్లేవారు. ప్రస్తుతం అది చాలా వరకు తగ్గింది. గ్రామాల్లో పూర్వ విద్యార్థులతో కలిసి తమకు అనుకూలంగానున్న క్రీడా మైదానాలను ఎంపిక చేసుకుని ఎండను సైతం లెక్క చేయకుండా ఆటల్లో మునిగిపోతున్నరు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సరదాగా వాలీబాల్ ఆడుతూ గడిపారు.

రాత్రంతా అడవిలోనే

- బర్రెలు కాసేందుకు వెళ్లి నల్లమలలో తప్పిపోయిన యువకుడు
- కృష్ణాపురంలో తేలిన వైనం
- క్షేమంగా ఉన్నట్లు పోలీసులకు ఫోన్



యువకుడు తరుణ్

ఆత్మకూరు: మండలంలోని ఇందిరేశ్వరం గ్రామానికి చెందిన 22 ఏళ్ల అరుణ్ బుధవారం ఉదయం గ్రామశివారులోని నల్లమల అటవీ ప్రాంతంలో బర్రెలు కాసేందుకు వెళ్లాడు. అయితే ఉదయం వెళ్లిన తరుణ్ అర్ధరాత్రి అయినప్పటికీ ఇంటికి రాకపోవడంతో కంగారుపడిన కుటుంబ సభ్యులు ఆత్మకూరు పోలీసులకు గురువారం ఉదయం ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు తక్షణమే రంగంలోకి దిగిన ఆత్మకూరు పోలీసులు డ్రోన్ కెమెరాల ఆధారంగా నల్లమల అడవి ప్రాంతం మొత్తం 8 గంటలపాటు వెతికారు. అయినప్పటికీ అదృశ్యమైన తరుణ్ ఆచూకీ లభించలేదు. చివరికి గురువారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఆత్మకూరు మండలం కృష్ణాపురం గ్రామంలో తరుణ్ ప్రత్యక్షం కావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. తాను క్షేమంగా ఉన్నట్లు పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. నల్లమల అటవీ ప్రాంతంలోకి బర్రెలు కాసేందుకు వెళ్లిదట్టమైన అటవీ ప్రాంతం కావడంతో తప్పిపోయి రాత్రంతా కొండపైనే ఉండిపోయినట్లు వెల్లడించారు. చివరికి ప్రాణాలతో కృష్ణాపురం గ్రామానికి చేరుకున్నట్లు తెలిపాడు.

మహానందిలో కొనసాగుతున్న భక్తజన సందడి



దర్శనానికి బారులు తీరిన భక్తులు

మహానంది: వేసవి సెలవులు ఉండటంతో మహానంది ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి వస్తుండటంతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడుతున్నాయి. ఉదయం, సాయంత్రం జరిగిన అష్టవిధ మహామంగళ హారతుల సమయంలో సాధారణ, శీఘ్రదర్శనం క్యూలైన్లలో భక్తులు గంటల తరబడి వేచి ఉండి భక్తులు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న కోదండరామాలయం, వినాయనంది, గరుడనంది ఆలయాలను సందర్శించారు. ప్రసాదాల కోసం గంటల తరబడి నిరీక్షించి ప్రసాదాలను కొనుగోలు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులరద్దీ కొనసాగింది.

మెరుగైన వైద్యం అందించండి

- రామతీర్థం, యర్రగుంట్ల గ్రామాల్లో డీఎంఅండ్‌హెచ్‌ఓ పర్యటన



రామతీర్థంలో వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న వ్యక్తిని పరామర్శిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ



పార్నపల్లెలో వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి వెంకటరమణ

నంద్యాల టౌన్: వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న వారికి మేలైన వైద్యం అందించాలని, చికిత్సలో జాప్యం చేయవద్దని జిల్లా వైద్య, ఆరోగ్యాధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. గురువారం పలుకూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర పరిధిలోని రామతీర్థం, యర్రగుంట్ల గ్రామాల్లో వాంతులు, విరేచనాలు ప్రబలడంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను పరిశీలించి, రోగులు, చికిత్సను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ వాంతులు, విరేచనాలు ప్రబలడానిక గల కారణాలు, తీసుకుంటున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు క్లోరినేషన్ చేసిన సురక్షితమైన, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. పరిసరాల, వ్యక్తిగత శుభ్రత గురించి ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. కేసులు పూర్తిగా తగ్గే వరకు గ్రామంలో ఉచిత వైద్య శిబిరం కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. పార్నపల్లి గ్రామ ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న బీసీజీ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. అనంతరం నంద్యాల పట్టణంలోని జగజ్జననీ నగర్‌లో నిర్వహించిన డెంగీ డే ర్యాలీలో పాల్గొన్నారు.


19 నుంచి ఆరాధనోత్సవాలు

మిడుతూరు: స్థానిక శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఈనెల 19 నుంచి ఆరాధన మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం గ్రామంలో గడెపు ఎద్దుల పందెములు, గుర్రపు పందెములు, సాయంత్రం ట్రాక్టర్ రివర్స్ పందెములు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గడెపు ఎద్దుల పందెములో విజేతల ఎడ్ల యజమానులకు వరుసగా రూ.15వేలు, రూ.10వేలు, రూ.7,500, రూ.5వేలు నగదును అందజేయనున్నట్లు తెలిపారు. ప్రవేశ రుసుం రూ. 200 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ట్రాక్టర్ రివర్స్ పందెములో విజేతలకు వరుసగా రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.1000 అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు ప్రవేశ రుసుం రూ.100 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. అలాగే.. గుర్రపు బండ్ల పందెములో విజేతలకు వరుసగా 25 తులాల వెండి, 20 తులాల వెండి, 15 తులాల వెండి, 10 తులాల వెండి, 5 తులాల వెండి బహుమతిగా అందజేస్తామని చెప్పారు. ఆసక్తి గలవారు ప్రవేశ రుసుం రూ. 200 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు.

21నుంచి శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు

మిడుతూరు: స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్ల ఆలయ ఈఓ ఏడీ వెంకటరమణ గురువారం తెలిపారు. 21న 5.20 గంటలకు స్వామి, అమ్మ వార్ల కల్యాణ మహోత్సవం ఉదయం 8 గంటలకు శేషవాహనం, రాత్రి 7.30 గంటలకు హనుమత్ ఉత్సవ కార్యక్రమం, 22న వైశాఖ శుద్ధ చతుర్దశి ఉదయం 8 గంటలకు సింహవాహనం, రాత్రి 7.30 గంటలకు గరుడోత్సవం, 23న ఉదయం రథాంగ హోమం, పూర్ణాహుతి కార్యక్రమం, సాయంత్రం 5.30 గటంలకు శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి వార్ల రథోత్సవం, 24న ఉదయం తీర్థావళి, పూర్ణాహుతి కార్యక్రమం, సాయంత్రం 5.30 గంటలకు పారువేట మహోత్సవం, నిర్వహిస్తున్నట్లు ఈఓ వెల్లడించారు. బ్రహ్మోత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయలని కోరారు.

వెదుర్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సైకిళ్లను చూపుతున్న అటవీశాఖ అధికారులు

మహానంది: బండిఆత్మకూరు మండలం నారపురెడ్డి కుంట సెక్షన్‌లోని బాలయ్యకుంట, మలుపుల చెరువు ప్రాంతాల్లో గురువారం నిర్వహించిన దాడుల్లో 16 సైకిళ్లపై తరలిస్తున్న వెదుర్లను స్వాధీనం చేసుకున్నట్లు బండిఆత్మకూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాసిర్‌ఝా తెలిపారు. రూ. 40వేల విలువైన 500 వెదుర్లను స్వాధీనం చేసుకుని మహానంది మండలం గాజులపల్లె ఆర్ఎస్‌లోని అటవీడిపోకు తరలించామన్నారు. అనుమతి లేకుండా అడవుల్లోకి వెళ్లడం , అటవీ సంపదను అక్రమంగా తరలించడం చేస్తే కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నాగేంద్రనాయక్, సిబ్బంది పీవీ సుబ్బయ్య, రవీంద్రనాయక్, తేజ, మదార్ సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

డిగ్గర్ బోల్తా..కూలీకి గాయాలు

- స్పందించని కాంట్రాక్టర్
- ఇబ్బందులు పడిన పశ్చిమ బెంగాల్ కూలీలు



బోల్తా పడిన డిగ్గర్

డోర్నిపాడు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో నూతన త్రీఫేస్ విద్యుత్ పనుల్లో భాగంగా గురువారం విద్యుత్ స్తంభాలు పాతే డిగ్గర్ బోల్తా పడింది. దీంతో డ్రైవర్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన సుభాన్ అనే కూలీకి గాయాలయ్యాయి. స్తంభాలు పాతే క్రమంలో ప్రమాదం చోటుచేసుకున్నట్లు కూలీలు తెలిపారు. రూరల్ డైరెక్ట్ సప్లయ్ సర్వీస్ (ఆర్‌డీఎస్ఎస్)లో భాగంగా గ్రామీణ ప్రాంతాలకు ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా త్రీఫేస్ సరఫరా చేసేందుకు నెల రోజులుగా కోవెలకుంట్ల సబ్ డివిజన్ సంబంధించి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కూలీకి గాయాలయ్యాయని విషయం తెలిపేందుకు కంట్రాక్టరుకు ఫోన్ చేసినా స్పందించలేదని తోటి కూలీలు వాపోయారు. తెలంగాణలో ఉన్న కాంట్రాక్టర్ ఎప్పుడూ సరిగా స్పందించరని స్థానికులు విమర్శిస్తున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక విద్యుత్ సిబ్బంది వైద్య చికిత్స చేయించారు.

అనుమతులున్న విత్తనాలనే విక్రయించాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

నంద్యాల(అర్బన్): ప్రభుత్వం అనుమతించిన విత్తనాలను మాత్రమే డీలర్లు విక్రయించాలని ఏడీఏ రాజశేఖర్ తెలిపారు. విత్తనాలకు సంబంధించిన సరైన ధ్రువపత్రాలు లేకపోతే దుకాణాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గురువారం పట్టణంలోని సాయి ఆగ్రో ఏజెన్సీస్, శ్రీవెంకటేశ్వర సీడ్స్ దుకాణాల్లో ఏఓ ప్రసాదరావుతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్, బుక్‌బిల్స్ తనిఖీ చేసి విత్తన నాణ్యతను పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ దుకాణాల నుంచి పది విత్తన నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపగా హెచ్‌టీ టెస్టులో నెగిటివ్‌గా నిర్ధారణ వచ్చిందన్నారు. విత్తనాలను విక్రయించే డీలర్లు ఎలాంటి అక్రమాలకు పాల్పడినా సహించేది లేదని హెచ్చరించారు.

జోరుగా.. హుషారుగా

- విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు



డ్రాయింగ్ నేర్చుకుంటున్న విద్యార్థులు

నంద్యాల(వ్యవసాయం): ప్రైవేటు విద్యాసంస్థలు, డ్యాన్స్, ఆర్ట్ అకాడమీలో సమ్మర్ కోచింగ్ సెంటర్ల పేరిట రూ.వేలు దండుకుంటుంటే కళారాధన సాంస్కృతిక సంస్థ చిన్నారులకు ఉచితంగా క్రీడలు, లలిత కళల్లో శిక్షణ ఇస్తుంది. పలు సంస్థల సహకారంతో పాటు వైద్యులు, ఉద్యోగులతో ఉచిత శిక్షణ ఇప్పిస్తోంది. 23 ఏళ్ల నుంచి ఇలా విద్యార్థులకు శిక్షణ ఇస్తోంది. స్థానిక మున్సిపల్ హైస్కూల్‌లో ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 9గంటల వరకు శిబిరం నిర్వహిస్తారు. కళారాధన సంస్థ, లయన్స్‌క్లబ్, రోటరీ క్లబ్, ఐఎంఏ సహకారంతో 2000 సంవత్సరంలో అధ్యక్షుడు డాక్టర్ మధుసూదనరావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవికృష్ణ ప్రారంభించారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది మే నెలలో వేసవి శిబిరం కొనసాగిస్తున్నారు. ఇందులో శిక్షణ పొందిన వారు ప్రస్తుతం ప్రైవేటు స్కూళ్లలో డ్యాన్స్ మాస్టర్లుగా, కోచ్‌లుగా రాణించడం విశేషం.

20 మంది కోచ్‌లు..

మున్సిపల్‌హైస్కూల్‌లో దాదాపు 900మంది విద్యార్థులు తరగతులకు హాజరవుతున్నారు. చదరంగం, ఆధునిక, శాస్త్రీయ నృత్యం, చిత్రలేఖనం, శారీ పెయింటింగ్, తైక్వాండో, శాస్త్రీయ సంగీతం, మిమిక్రీ, వాయిద్య సంగీతం, భగవద్గీత, తెలుగు పద్యాలు, కీబోర్డు, కబడ్డీ, కర్రసాము, డ్రాయింగ్, పెయింటింగ్ తదితర లలిత కళల్లో శిక్షణ ఇస్తున్నారు. దాదాపు 20 మంది కోచ్‌లు ఎలాంటి ఫీజులు లేకుండా స్వచ్ఛందంగా శిక్షణ ఇస్తున్నారు. శిబిరం ఈ నెల 25న ముగుస్తుంది. టౌన్‌హాల్‌లో జరిగే కార్యక్రమంలో ప్రదర్శనలు ఇచ్చే అవకాశం కల్పిస్తారు. ఈ కార్యక్రమంలో మెమొంటోతో పాటు ప్రశంసా పత్రాన్ని శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు అందజేస్తారు.

తింటే.. చింతాకు పప్పే తినాలప్పా!



గుండుపాపల వద్ద చింత చెట్టు ఎక్కి చిగురు కోస్తున్న మహిళ



క్రిష్టిపాడులో చింత చిగురు విక్రయిస్తున్న మహిళ

డోర్నిపాడు: ఇటీవల కురిసిన వర్షాలకు చింతచెట్లు చిగుర్లు తొడుగుతున్నాయి. దీంతో కొందరు మహిళలు చిగురును కోసి మార్కెట్‌లో విక్రయించి ఉపాధి పొందుతున్నారు. ఈ సమయంలో మాత్రమే లభిస్తుండటంతో చాలా మంది చిగురును ఎక్కువగా కొని ఎండబెట్టుకొని అవసరమైనప్పుడు వాడుకుంటున్నారు. ఇక పల్లెల్లో మాత్రం తొలి కాపు చిగురును రుచి చూడందే వదలరు. కందిపప్పులో వంకాయ, కాస్త చిగురువేసి పప్పు చేసుకొని తినేముందు కాస్త నెయ్యి వేసుకొని ఆరగిస్తే ఆ రుచే వేరని పల్లెవాసులు చెబుతున్నారు.